# జెట్టీ

బయట సన్నని జల్లు పడుతున్నది. లోపల గాలిలేక ఉక్కపోస్తున్నది. కొంప ఇరుకుకొంప. పదివేల కల్పాల నుండి కాలగమనం స్తంభించి పోయినట్లుగా వుంది.

తండ్రీ కొడుకులమధ్య సంభాషణ సాగలేదు. వాళ్ళిద్దరూ ఆజాను బాహులు. జెట్టీలు- తరతరాలనుండీ తమను పోషిస్తున్న ప్రభువుల వీర సేవలో వారి కండరాలు పిరికితనాన్ని మరచిపోయినవి, ఉష్ణకాసారం వలె వుడుకుతున్న వాళ్ళరక్తం గదిలోని విషమ ప్రతిష్టంబనలో సంచల నమే పోగొట్టుకొన్నట్లున్నది.

ఆ యింట్లో దీపంలేదు. నరసింహులు జెట్టీ—నిప్పురాయికొట్టి ఆరి పోయిన పచ్చిఆకు చుట్ట తిరిగి వెలిగిస్తున్నాడు. నిప్పురాయి మెఱుగులో అతని పలితకేశాలు బంగారంవలె మెరిసినవి. కొడుకు పొంతకుండ

ప్రక్కన మునిగాళ్ళమీద కూచుని పొయ్యిలోకి పుల్లలెగదోసి మంట చేస్తున్నాడు. అతనిముఖం తూర్పుకు, తండ్రిముఖం పడమటకు. పచ్చి పుల్లలు మండక పొగతో వేధించినప్పుడు, పొయ్యిమీదకుండలో కళపెళ ఆగిపోతున్నది. కుండలోని గిద్దెడంపే గిద్దెడే మెరికలు దంచగా వచ్చిన బియ్యపుగింజలు. కాని కుండనిండు గంజి వస్తుందని పొగలో, విష వాయు స్తంభనలో రెండు మానసిక సంఘర్షణలో బరువుగా, బిరుసుగా, దురభిమానపు మూర్తిగా. నిరాశాదేవత మంటపంగా మారిన ఆ యిరుకు కొంప ఒక తాత్కాలిక ఆశతో – కాలగమన స్తంభనను ఛేదింప జూస్తోన్నది. కాని పొగను భరించలేని వీరరాఘవులు జెట్టీ కళ్ళు మండి పోతున్నవి.

విసుగుపుట్టి పెద్దజెట్టీచుట్టి పారవేయబోయాడు. కాని తన చెయ్యి వెనుకకు లాగింది చిన్నజెట్టీ, కడుపుమంటతో కుండ బద్దలు చెయ్య బోయాడు. కాని అతని మనసు వెనుకకు పీకింది. అతడు బొంగు వూదు గొట్టాన్ని కింద పారేశాడు. కుండలో గడబిడ గప్పునలేచిన మంటతో పాటు, తిరిగిసాగింది. కాని జెట్టీలమధ్య సంభాషణ సాగలేదు. వాళ్ళు శత్రువులుకారు. ఆకలి, రక్తం, శౌర్యం వాళ్ళిద్దరూ పంచుకొన్న పొత్తు సొత్తులు.

ఉండివుండి జెట్టి నరశింహులు మఱ్ఱిఆకు పొరగా చుట్టిన చుట్ట దూరంగా విసిరి వేశాడు. కొడుకు పక్కకు తిరగకుండానే–"రాజావారు కబురు పంపించారు" అని విషవాయువులోకి తన ఆత్మను వదిలాడు.

పగ బ్రాచువలే పొగగొట్టాన్ని వూదాడు చిన్నజెట్టీ వీరరాఘవులు. అతడు తండ్రిమాటకు ఊఁ అనలేదూ అఁ అనలేదు. కాని ఆ మాటలు పదివేల కల్పాల నిశ్శబ్దతనూ, విషమ ప్రతిష్టంభననూ భంగ పరచ గలిగినవని అతనికి తెలుసు.

కాని అతడు సమాధానం చెప్పలేదు. అన్ని నాళాల్లోని రక్తం జివ్వున అతని హృదయ మండలంలోకి లావావలె దూకింది.

పెద్దజెట్టి మళ్ళీ మెల్లగా అన్నాడు.

"చిన్న దొరవారు సీమనుంచి తిరిగివచ్చారట". ఊఁ లేదు ఆఁ లేదు.

"యువరాజావారికి షికారీ సేర్పాలని కబురు". ఊఁ లేదు ఉప్పు రాయిలేదు.

"పడమట అడవిలో చిరుతను మాటు బెట్టాలని సెలవయింది".

ఆ గదిలో హఠాత్తుగా ఒక ఉరుము ఉరిమినది.

"ఆ గాడిదలమాట నాదగ్గర తేవద్దని లక్షసార్లు చెప్పాను"

"వాళ్ళ ఉప్పుతిన్నాంరా...వీరన్నా."

"ఆ కూతే కుయ్యొద్దన్నాను. ఎవరిదా ఉప్పు మనం తినటానికి మన ఉప్పు మనంతిన్నాం. ఎవరి ఉప్పుతింటే అమ్మ అట్లాకుక్క చావు చచ్చింది? ఎవరి ఉప్పుతింటే మనకి గతిలేని గంజి యివ్వాళ్ళ కరువైంది? ఎవరి ఉప్పుతింటే నీకు యీకొయ్యకాలు దొరికింది?"

జెట్టి నరశింహులు కండరాలన్నీ ఉబికిపోయినవి. చీకటిలోగూడా అతనికి అద్దంలోలాగా తన ముఖబింబం కనిపించింది. అది కందగడ్డ. ముదిరి ఎర్రబారిన నలుపు కందగడ్డ. ఆ మాటలు అతని జీవితపు సంపూర్ణ చరిత్ర. నిలవలేక అతడు కదిలాడు. ఒకకాలు బరువుగా కదిలి శబ్దం చేసింది. అది కుంటి కొయ్యకాలు.

బయట జల్లు వానకింద మారింది. ఇంట్లో నిశ్శబ్దం తిరిగి మానవుల బాహ్య ప్రపంచంమీద అధికారం చలాయించింది. పొయ్యి త్రాచు పాము బుసలు కొట్టటం మానింది. పొయ్యిముందున్న మనిషి పళ్లు పటపటలాడలేదు. ఇటు కొయ్యికాలు కదిలి కటుశబ్దం చెయ్యలేదు. ఊర్ధ్వ లోకపు అక్షౌహిణి జనుల ఏడుపువలె వాన శబ్దం చేస్తున్నది. పొయ్యి ఆరిపోయినట్లుంది. పైన బూడిద. లోపల నిప్పు.

వీరరాఘవులు రెండు ముంతల్లో గంజిపోసి ఒకటి నిట్టాడి స్తంభానికి దగ్గరగావుంచి ఒకటి ముందుంచుకున్నాడు. రెండు ముంతల

నుండీ భూదేవి ఆవేదనవలె ఆవిరి పైకొస్తున్నది. చిన్న జెట్టీ గంజి వూదుకొని ఒకసారి చప్పరించాడు. అందులో ఉప్పులేదు.

అడవిలో మానుల రాపిడివలె అతను పళ్ళుకొరికి దిగ్గున లేచాడు. చీకట్లో చూరులో చేతులుపెట్టి రెండుమూడు చోట్ల వెతికాడు. తిరిగి పొయ్యిలోకి తొంగిచూచి వూది ఒక మోదుపుల్లను కాగడాగా చేశాడు. ఈమాటు అతనికి చూరులో వుప్పుపొట్లాం కనిపించింది. కాగితం మడతలో. ఓర్పు లేకుండాగబగబా విప్పాడు. అందులో చారెడు వుప్పు కూడా లేదు. అతడు పొట్లాం నిట్టాడిదగ్గిరి ముంతలో విదిలించి తిరిగి తన ముంతముందు చతికిలపడ్డాడు.

ఒక్క నిట్టూర్పు విడిచి కొయ్యకాలు కదిలింది. అప్పుడే బయట నుండి వీస్తున్న చలిగాలికి ముంతలో ఆవిరి పైకి రావటం మానింది.

"అదిగాదురా వీరన్న"

కొడుకు మాటలేదు. పెద్దజెట్టి ఒకచేత్తో నిట్టాడి అందుకొని మెల్లగా ముంత అందుకొని, అవురావురున రెండు గుక్కలు తాగాడు. కొంచెం ఆగి, వుప్పు కరిగేటట్లుగా ముంతను గుండ్రంగా కదిలించాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. నీకా పని దొరక్కపోయే. చివరికి గుర్రాన్ని మాలీసు చేద్దామన్నా రాజాగారి గుర్రాలన్నీ పట్నంబోయె. నాకు వెనకటి ఓపిక వుండి చచ్చిందంటా? ఈ షికారీకి పోయొస్తే పది డబ్బులు దొరుకుతై. ఇంతలో నీకు పని దొరక్కపోదు."

కొడుకునుండి ఒక్క మాటగూడా రాలేదు. అతను గంజి చప్పరిస్తున్నాడు.

"నీతోడు. కాని కాలం వచ్చింది. ఈ ఒక్కసారి పోయిరానీ."

కొడుకు మాటాడ దలుచుకొన్నాడు. పెద్ద జట్టీ ముంతలో గంజి అడుగున బడింది. వీరరాఘవులు ముంత తరగలేదు.

"యువరాజావారు మంచి సరసుడు. చిన్నప్పుడు సామూ, తుపాకి నీతోపాటుగదరా నేర్చింది? ఏం దర్జామనిపి! నువ్వెరగవూ?"

కొడుకు వొక్కటే ప్రశ్న వేశాడు.

"అమ్మకు దొంగతనం అంటగట్టి కాసావాళ్ళు చావమోదుతుంటే ఏ దర్జాపురుషుడు అడ్డం వచ్చాడు?"

ఆకాశంమీద అమరలోకాలన్నీ ఒక్కసారి శోకించినట్లుగా రాత్రి గంభీరతలో, ఊర్ధ్వలోకాల అశ్రువులు ఆకాశానికి చిల్లులు పొడిచినవి. అంతకంతకూ వాన పెద్దదవుతూనే వున్నది. అన్నవలె చలిగాలి ఆసరా వచ్చినది.

ఒక్క వాక్యం. ఒక్క ప్రశ్న. ఒక్క దురంత కఠిన సత్యం. ఒక్క కుటుంబం. ఒక్క ఇల్లాలు. ఒక్క కొడుకు. ఒక్క తండ్రి ఒక్క దురన్యాయం.

పెద్ద జెట్టీ పెల్లుబుకివచ్చిన క్రోధాన్ని దిగమింగుకొన్నాడు. ఎవరామానవమాత్రుడు. తనముందింకా. ఆ ప్రశ్న తర్వాత గూడా బ్రదికున్నది? తన కొడుకు. తన రక్తాన్నీ, కండరాల్నీ, నరాల్నీ, పోలికల్నీ పంచుకొన్న తన కొడుకు కనకనే బ్రతికాడు.

"మాట యిచ్చాన్రా వీరన్నా! నామాట విను. ప్రభువులతో పని. సాధించి చేసేది సున్న. కలో గంజో తాగి బతకాలి."

కొడుకు ముంత ఎత్తి సూటిగా స్తంభానికేసి గిరవాటు వదిలాడు. ఆకాశపు శోకానికి మానవుల అంజలి యిది.

"మా యిచ్చావ్‌గా—పో. పో. పో. వాళ్ళ గులాంవిగా. నీకు పుట్టలేదనుకొంటా. ఇంత పిరికి గుండెకు, యింత నీచుడికి తిరిగి నేను పుట్టను. నీకూ నాకూ యింతే చెల్లు పో. పో."

వీరన్న చీకటివానలోకి గంతువేసి దూకాడు. పైనున్న శోకతప్తులు అతన్ని పిలువలేదు. కిందున్న చీకట్లో అతను మాయమైనాడు. గంజి కుండ పెంకులు పెద్ద జెట్టీ మంచి కాలుకు గుచ్చుకొన్నవి. అతడు వానలోకి తొంగి చూశాడు. తను ఊర్ధ్వలోకపు శోకాతురుల ప్రతినిధిగా గంజిముంతను వానలో పెట్టాడు.

## 2

పెద్ద జెట్టీకి పిలుపు వచ్చింది.

"దొరవారు తయారుగా వున్నారు. యానాదులు పొద్దున్నుంచి పడిగాపులు కాస్తున్నారు. ఏమయ్యా, ఎంత జెట్టీ వయితేమాత్రం యింత తలబిరుసా? పద, పద"

పిలుపు!

"తను మాటుబెట్టిన పులిముందు నుంచుని తుపాకితో ఫొటో తీయించుకొని పేపర్లలో వీరులుగా మెల్లైక్కే ప్రభువుల పిలుపు వచ్చింది. నరసింహులు జెట్టి కొయ్యకాలు తిరిగి శబ్దం చేసింది. ఉక్కు భీముణ్ణి లక్షతుంపులనుగ్గుగా, ధృతరాష్ట్రునివలె తను ఆ పిలుపు తెచ్చిన వాని పీకెను నులిమి వేయగలడు. కాని అది దొరపిలుపు. అది కడుపు పిలుపు- అది ఆ యింటి ఆకలి పిలుపు. ఆ సంగతి పెదజెట్టీకి తెలుసు.

అతను నులకమంచంలో మూలుగుతున్న కొడుకువంక చూస్తూ ఆ చీకటిలో, వానలో కలిసి తడిసి జ్వరతీవ్రతతో, పూపిరిపిత్తుల ఎగ శ్వాసలు. తన కొడుకు యింటికి రాకపోయినా బాగుండును. కాని తన కొడుకు- తన యిల్లు తన పొత్తు సొత్తు. వచ్చి కుక్కి నులక మంచంలో దగ్గుతున్నాడు.

అతడు కొడుకువంక చూశాడు. అతని కుంటికాలు అడుగెత్తి అడుగువేసి పిలుపు తర్వాతి నిశ్శబ్దానికి భంగం చేసింది. ఎవరతను? యుధిష్ఠిరుడా? ధృతరాష్ట్రుడా?

కొడుకుకు దగ్గు తెరవచ్చి పోయింది. ఆతడు పెద్దమూలుగు మూల్గాడు.

"పోయిరా నాన్నా !"

పెద్దజెట్టీ చిన్న జెట్టివంక జూశాడు. తండ్రి కొడుకు వంకకు తిరిగాడు. నరశింహులు వీరరాఘవుల్ని తేరిపార జూశాడు. ఆ మాటలు ఆకాశాన్నుంచి వూడిపడలేదు. భూమిబద్ధలై ఆ శాంతన వచనం

వినబడలేదు. అది తన కొడుకు కంఠం. అది తన కొడుకు వాక్యం. అది కుక్కి నులకమంచపు దగ్గునుండి వచ్చింది. అతని కాయ్యకాలు ముందుకుసాగింది.

అతను డప్పుల యానాదులతోపాటు జీప్‌లో కూర్చున్నాడు. వెనకవస్తున్న క్యాడిలాక్‌లో యువరాజావారు. పట్నంనుంచి బోగం వాళ్ళ కోసం వచ్చిన ఆయన ఒక మిత్రుడు. చిఱుత పసిగట్టో దెబ్బ తినో యువరాజా దొరనే కబళించబోతే తన ప్రాణం అడ్డువేసి ప్రభు రక్షణకు పూనుకోవాలి. అడివిలో ముల్లు విరగకుండా యీ పాలబుగ్గల ప్రభు బిడ్డను తను కాపాడాలి. కాని తను, ప్రాణరక్షకుడు, దొరల ప్రక్కనే కూర్చొను అర్హుడుగాదు. అతని హృదయం కమిలి పోయింది. నులక మంచం కుక్కిలోని మూల్గుల కొడుకు, దుమ్మును చీల్చుతున్న జీపుకారు అద్దంలో కన్పించాడు. ఆనాటి రాత్రి చీకటివలె అతని హృదయాన్ని నల్లని తలంపులు పెనవేసుకొన్నవి.

అడివికి మైలుదూరంలోనే ప్రభువులు కట్టించిన మట్టిడొంక గూడా మాయమైపోయింది. అక్కడే కార్లాగినవి. కనుచీకటి పడలేదు. జెట్టీ నరశింహులు జీపుదిగి చిన్న దొరకు అభివాదం చేశాడు. చిన్న దొర సిగిరెట్టు పారేసి డ్రైవరును సంబోధించాడు.

"ఎవ్రరా యీ కుంటి వెదవను మనతో తోలింది."

డ్రైవరు సమాధానం. అతను—పెద్దజెట్టీ - వినలేదు. చిన్న బాబులు తనను మరిచిపోయారేమో.

"ఈ దాసుడు తమకు చిన్నతనంలో తుపాకివేత, సాము నేర్పాడు దొరా!"

ఈ గురుసమానుడి మాట చిన్నదొర చెవిని దూరలేదు. రాత్రి అనుభవించవలసిన పశుభోగాలు భంగమై పోయాయని కుళ్ళుతున్న పట్నం స్నేహితుణ్ణి అతడు సముదాయిస్తున్నాడు. కుంటి వెధవ!!

చిఱుతను పట్టుబెట్టటానికి అన్ని సన్నాహాలు పూర్తి అవుతున్నై

కాని పెద్ద జెట్టి హృదయం ఆ విషయంలో సన్నాహం కావటంలేదు.

కుంటివెధవా ! శత్రురాజులు దండెత్తి వచ్చినప్పుడు ప్రభువుల ప్రాణాన్ని, అంతఃపురాల మానాన్ని బొక్కసాల సంపదను—కాపాడిన వీరజెట్టీల సంతతివాడు. మల్లయుద్ధాల్లో సంస్థానపు గెలుపు జెండా ఎత్తిపట్టిన యోధుడు. ఈ కుంటికాలెందుకు వచ్చింది? ప్రభువులు తమవన్న అడవుల్ని ఆటవిక వీరులు కొల్లగొట్టకుండా ప్రాణాలొడ్డి పోరాడినందువల్లనేమి? మన్యపు చలి జ్వరాల్లో, నాలుగు నారికురు పుల్ని మరిచిపోయి, అహర్నిశలు ఈ ప్రభువుల ఆస్థి కాపాడి దేవిడీలో తిన్న తిండికి పదింతల సేవను సమర్పించిన సేవకుడు తను గాదా ?

కాని యీ భీష్మాచార్యులకు, ఈ ద్రోణాచార్యులకు, ఈ అశ్వద్ధామలకు పట్నపునీతి అబ్బిన కొత్తరాచరికంలో కాసావాళ్ళకున్న గౌరవం లేదు. ప్రభువుల రౌడీ కారుడ్రైవర్ల ప్రతిపత్తి లేదు. ప్రజలనుండి దోచుకొన్న భూములమ్ముకొని పట్నాల్లో ఫ్యాక్టరీలూ, పందెపు గుర్రాలు కొన్న ఈ కొత్తరాచరికం—కోటల్లో, దేవిడీల్లో, అంగరక్షకుల పురా తన గృహాల్లో గూడా తలదాచుకోకుండా తరిమివేసింది. ఎవరీ కుంటి వెధవా ? వీరుడు. యోధుడు. గురుసమానుడు. ప్రాణరక్షకుడు. ఒకప్పుడు ప్రజాశత్రువు. ఇక—ప్రభు భక్షకుడు. భీష్మా చార్యులకు గాదు శిఖండి. రావణాసురులకు విభీషణుడు. ధృతరాష్ట్రిడేగాని యుధిష్టిరుడుగా తను చచ్చిపోలేదు. తను అశ్వద్ధామ. ఈ కౌరవ సంతానంనుండి ఏనాడో బయట పడ్డాడు. వానలో కొడుకన్న మాట తన వేదం. తన లక్ష్యం. తన ధర్మం. ప్రభు సేవలో పడిపోయిన తన పూర్వుల గోరీలకు ఇక రక్తాంజలి. తరతరాలు రైఫిల్ పట్టిన తమ నిరంకుశత్వానికి యిక ధర్మరక్షణ కర్తవ్యం. పులినుండి పులులు. దుమ్మునుండి మానవులు. రక్తం నుండి కొత్త రక్తం. వీరుల నుండి వీరులు.

## 3

చీకటి పడుతున్నది. మబ్బులనుండి విడిన చంద్రుడి మూగ వెలుతురు అడివి సాంద్రతమీద వాలి వాపోతున్నది. వేటకు కావలిసిన

మాటులన్నీ జెట్టి నరశింహులు ఏర్పాటు చేశాడు. ఏభై గజాల దూరంలో చిన్న నీళ్ళ దొరువు ఒడ్డున ఎండి చిగురేస్తున్న చెట్టుకు మేకను అంట గట్టారు. దొరువు కెదురుగా చింత చెట్ల చాటులో మంచె గట్టివున్నది. మంచెమీదికి చిన్నదొర నెక్కించి జెట్టి చిన్న గొంతుతో చిఱుత వేటలోని లోతుపాతులు వ్యక్తం చేస్తున్నాడు. యువరాజావారి పట్నపు మిత్రుడు నిషా సీసాలతో డ్రైవరుతోపాటు కారు దగ్గరే నిలిచి పోయాడు. ఆయన అసహాయులైన అబలలను బలాత్కరించడంలో అతి ధైర్యశాలి కాని చిఱుతపులుల వేటలోగాదు. మంచెకింద రెల్లుపొదల్లో డప్పులయానాది వాళ్ళు నాలుగు మూలలకూ చెదిరిపోయి నక్కివున్నారు. చిఱుతను అయోమయ పరచటానికి వాళ్ళు ఒక సమయంచూసి డప్పులు మోగిస్తారు.

మేకను పొట్ట బెట్టుకోటానికి వన్నెలమెకం వస్తుంది. దాన్ని భక్షించి చెరువులో నీళ్ళు తాగబోతుంది. ఆ మత్తులో దానికి తుపాకి గుండు తగులుతుంది. ఇంతలో నలుమూలలనుండి డప్పులు మోగుతాయ్ దానికి శత్రు వెక్కడున్నాడో తెలియక తబ్బిబ్బు పడుతుంది. దారి తెన్ను తోచదు. ఇంతలో ఇంకొక దెబ్బ. ఢాం !! అంతే ఇదీ ప్లాను.

''ఇప్పటినుండే ఆ స్థలాన్నంతా పరిశీలించి అవగాహన చేసుకొని గురి సరిజూసు కోవాలి" అని జెట్టీ యువరాజా దొరవారిచెవిలో చెప్పాడు.

"మనిషివాసన దక్కిందా ఇక అంతుదొరకదు !"

యువరాజా తమ సీమలో కొనితెచ్చిన జోడుగుళ్ళ ఆస్ట్రియన్ తుపాకి తెచ్చారు వేటకు. పెద్ద జెట్టికి వెనకటి రోజుల్లో బహుమతి పొందిన మొదటియుద్ధం నాటి ఇంగ్లీషు ముతకరకం తుపాకి వుంది. కాని అది డజను మెకాల మెచడులు చీల్చిన ఆయుధం, అంతా నిశ్శబ్దం.

చిన్నదొరగుండెలో మోతలు జెట్టికి వినబడుతున్నవి. దొరవారికి యిందాకటి వేళకోళం పోయింది. జెట్టి తను ప్రాణ ప్రదంగా యిన్నేళ్ల

నుంచీ శుభ్రపరచి పోషించి దాచిన తుపాకి వంకకు చూశాడు. దాని బారు మంచె చీకటిలో నిగనిలాడుతున్నది. చిన్నదొర హృదయ స్పందనం ఆస్ట్రియన్ జోడుబార్ల తుపాకినుండి ప్రసరించి. తన మొద్దు తుపాకి బారునుండి సరాసరి తన హృదయానికి తగులుతున్నది. అంతా నిశ్శబ్దం.

అతనికి హఠాత్తుగా తన పేరు స్మృతికి వచ్చింది. తన పేరు జెట్టి నరశింహులు. నరశిహావతారంలో హిరణ్యాక్ష హిరణ్య కశిపుల వధ జరిగి, ప్రహ్లాదుల రక్షణ జరిగింది. కాని అతను పానకపు కుండలు అసంఖ్యాకంగా తాగిన మంగళగిరి నరశింహస్వామివలె కదలక కూర్చున్నాడు. అతను హఠాత్తుగా అన్నాడు—"బాబూ. తమ పేరేమిటి?" యువరాజా గజం పొడుగుగల తన బిరుదులను పేర్లపట్టీ చదివాడు. అంతా చెప్పి, "నా పేరెందుకు?" అని ప్రశ్నించాడు. జెట్టీ "ఊరికెనే ప్రభువులకు చిన్నప్పుడు తుపాకి వేతనేర్పించి నప్పుడు ఎప్పుడూ అడగలేదు. అప్పుడు తమరు చిన్నవారు." అంతా నిశ్శబ్దం.

దూరాన రెల్లు దుబ్బులముందు ఒక నీడ కదిలింది. చిన్నదొర జెట్టిని తాకాడు నిశ్శబ్దంగా. యువరాజా చెయ్యి వణికిపోతున్నది.

"చిఱుత"

"కొంచెంఆగాలి" అంతా నిశ్శబ్దం.

నీడ పెద్దదైనది. తర్వాత ఆకారం కనబడ్డది. ఆకారం అరుస్తున్న మేకవైపు నడిచింది.

... ... ... ... వేధిస్తూ ఒక అసహాయ ఆర్తనాదం వినిపిస్తోంది. దురన్యాయానికి ఖిన్నురాలై తలవంచి అడివి దిక్కులేక పరికించింది. కాని ఆ మూలనుండి ప్రతిధ్వని, ఆ ఒంటరి ఆర్తనాదానికి బదులు చెప్పింది, అంతా నిశ్శబ్దం.

మంచెమీద మనుషులకళ్లు మెరిసినవి. వాళ్ళ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగినవి. వారి తుపాకి బారులు గూడా మెరిసినవి చీకటిలో. దురన్యా

యాన్నీ, ప్రకృతి ధర్మంలో లిఖించిన సమన్యాయాన్ని, మానవ న్యాయం విచారించ నున్నది.

జెట్టి నోరులో నోరుపెట్టి "తమరు" అన్నాడు. కాని ఆస్ట్రియన్ జోడు బార్ల తుపాకి కదిలి పోతున్నది. చీకటిలో యువరాజా ముచ్చె మటల బిందువులు ముఖంమీద తళతళ లాడుతున్నవి. జెట్టీ మోచేతితో "ఊఁ" అన్నాడు.

మంచెనంతా కదిలిస్తూ మెఱపు మెరిసి "ఢాం" అన్నది. కాని అది మెకానికి తగలలేదు. వణుకుతున్న చేతులు గురితప్పి నీటిలోకి గుళ్ళు విడిచినవి. ఇక నిశ్శబ్దం లేదు. నియంత నాందీ వాక్యంవలె భయంకరమైన గోండ్రు వినిపించింది. అష్టప్రజాప్రతుల యజ్ఞశాలలోని వాయిద్య గోష్టివలె నలుమూలలనుండీ డప్పులు పిక్కటిల్లినవి.

చిఱుత పిరుదులు తిప్పి మంచెకు సూటిగా చూసింది. అక్కడే నరుడి వాసన. గాండ్రించి ఒక్క దూకు దూకింది. యువరాజా ఒక్క క్షణం నిలవలేదు. తనను వదిలి వేసి మరొక్క సారి

ఒక్క ఉడాయింపు దూకు దూకాడు.

జెట్టి ఊపిరి పీల్చుకోలేదు.

"ఢాం"

మున్వెన్నెల మెకం మూడుచుట్లు తిరిగింది. జెట్టీ రెల్లుదుబ్బల్లో గుచ్చినబల్లెం తీసి ఒక్క గిరవాటు వేశాడు. అది మొకానికి భూమికీ ఇరుసుగా గుచ్చుకున్నది. అంతా నిశ్శబ్దం. తప్పెటలు ఆగిపోయినవి.

జెట్టీ ఊపిరి పీల్చుకొని మంచె వెనుకకు చూశాడు. దూరం పోలేక పరుగిడుతున్న చిన్నదొర తెల్లచొక్కా కనిపించింది. నరశింహులు తుపాకి లంకించుకొని రెల్లు తలలమీద గురి చూశాడు. దూరపు ప్రతిధ్వానికి వణికి తలలు వంచింది. ఢాం...ఢాం...ఢాం... తెల్లచొక్కా మీద నీడ కనిపించింది: భూమి కొరిగిపోయింది.

జెట్టి మంచెదిగి చచ్చిన చిఱుత పక్కన ఒక్క క్షణం కూర్చు

న్నాడు. కాని డొక్కలోని బల్లెం లాగి దొరువులోకి విసిరి వేశాడు. యూనాదులంతా కార్లవద్దకు పలాయనం చేశారు.

ఆ తెల్లవారుజామునగాని పెద్ద పోలీసు బందోబస్తు అతన్ని చుట్టుముట్టలేదు. అతడు చిన్నదొర శవం పక్కనే కూచొని వున్నాడు.

లాంతరు వెలుతురులో అతడు పోలీసులను తన ముఖం చూడనిచ్చి చేతులు ముందుకు చాచి అన్నాడు—

## 4

"నా పేరు నరశింహులు. నే నే చంపింది. అరెస్టు చెయ్యండి."

పెద్ద జెట్టీని ఉరితీస్తారు.

కాని ఆ వుదయం అతని వద్దకు కొడుకును తీసుకొచ్చారు.

......

కొడుకు తండ్రి పాదాలు తాకి—

"నాన్నా. నువ్వు జెట్టివి. జగజెట్టివి. నేను నీ కొడుకును. ఆ రోజు నేను నిన్నన్నమాటలు మర్చిపో నాన్నా!" అన్నాడు. ○

ఆంధ్రసచిత్రవారపత్రిక—